క్లుప్తంగా

టీడీపీ కౌన్సిలర్ రాజీనామా



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు కౌన్సిలర్ గెల్లా సంధ్యారాణి శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావుకు అందజేశారు. ఈసందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ కౌన్సిలర్ పదవితోపాటు టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేసినట్లు తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌కు అందజేసినట్లు వివరించారు. అదేవిధంగా ఆమె భర్త గెల్లా వైకుంఠేశ్వరరావు కూడా యూనిట్–12 ఇన్‌చార్జి పదవికి కూడా రాజీనామా చేశారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి పాలన బాగా లేదని, 21వ వార్డులో అభివృద్ధి పనులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని సంధ్యారాణి తన సన్నిహితుల వద్ద వాపోయినట్లు తెలిసింది. ఈ విషయంపై వార్డు ప్రజలకు సమాధానం చెప్పుకోలేక ఆమె తన పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం.

కలశజ్యోతి ఊరేగింపు



నందిగామటౌన్:గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి దీక్ష మాలధారులు శుక్రవారం నిర్వహించిన కలశ జ్యోతి ఊరేగింపు కనులపండువగా సాగింది. పట్టణంలోని సీతారామాంజనేయస్వామి వారి ఆలయం వద్ద స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై తిరుపతమ్మ, గోపయ్య స్వాములను ఉంచి మంగళవాయిద్యాల నడుమ పట్టణంలోని ప్రధాన వీధుల్లో కలశ జ్యోతి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో దీక్షా స్వాములు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



కంచికచర్ల: స్థానిక ఎరువులు దుకాణాలలో వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కంచికచర్ల జుజ్జూరు రోడ్డులోని విజయ దుర్గ పెస్టిసైడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించగా సరైన అనుమతిపత్రాలులేని కారణంగా అమ్మకాలను నిలిపివేసినట్లు నందిగామ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు, ప్రత్యేక అధికారిణి శశికళ తెలిపారు. కొత్త రకం ఎరువులు, పురుగుమందులు వచ్చిన సమయంలో వాటికి సంబంధించిన ఓ ఫారంలను లైసెన్స్‌లో పొందుపర్చాలని లేనిపక్షంలో అమ్మకాలను నిలిపి వేస్తామని ఆమె వివరించారు. తనిఖీల్లో మండల వ్యవసాయయ అధికారి కే విజయకుమార్ పాల్గొన్నారు.

వివాదానికి దారితీసిన హోర్డింగ్‌ల తొలగింపు



జగ్గయ్యపేటఅర్బన్: కృష్ణా–గుంటూరు గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మున్సిపల్ అధికారులు పట్టణంలోని ఆయా కూడళ్లలో ఉన్న రాజకీయపార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్‌ల తొలగింపు పనులు చేపట్టారు. టౌన్‌ప్లానింగ్ అధికారి గోవర్ధన్ పర్యవేక్షణలో మున్సిపల్ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఆయా ఫ్లెక్సీలు, బోర్డులు, బ్యానర్లను తొలగించారు. రాజకీయ నాయకులు, వివిధ జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు ఏర్పాటు చేశారు. ఆయా సంస్థలు, సంఘాలకు చెందిన ఫ్లెక్సీలను సైతం తొలగించడంతో వాటి నిర్వాహకులు మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. పట్టణ ఎస్ఐలు జి.రాజు, వెంకటేశ్వరరావు తమ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని ఇరువురికి నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ఏవో రాఘవశర్మకు సత్కారం

నందిగామటౌన్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏవో రాఘవశర్మ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా తోటి ఉద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. రాఘవశర్మ దంపతులను ఎంపీపీ హనుమంతరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ అన్నం పిచ్చయ్య, ఈవోపీఆర్డీ పద్మజ్యోతి, సిబ్బంది నాగలక్ష్మి, మనీష, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. రాఘవశర్మ మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన తోటి ఉద్యోగులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సాగునీటి కష్టాలు

- సాగర్ జలాల విడుదలలో తీవ్రజాప్యం..
- నవంబర్‌లో విడుదల కావాల్సిన సాగునీరు
- నాలుగునెలలైనా కానరాని సాగర్‌జలాలు
- ప్రశ్నార్థకంగా మారిన 51వేల ఎకరాల ఆయకట్టు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న రైతులు



పేరకలపాడు వద్ద సాగర్‌జలాలు రాక ఖాళీగా దర్శనమిస్తున్న మూలపాడు మేజర్ కాల్వ

కంచికచర్ల: నియోజకవర్గంలో నాగార్జునసాగర్ కెనాల్ ఆయకట్టు పరిధిలో రబీ పంటల సాగుకు అవసరమైన సాగర్ జలాల సరఫరాపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రబీసాగు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మూలపాడు , ఇబ్రహీంపట్నం మేజర్ కాల్వ పరిధిలో కంచికచర్ల, వీరులపాడు మండలాల పరిధిలో 51వేల ఎకరాల ఆయకట్టు ఉంది. రబీసాగుకు సంబంధించి నవంబర్‌లో విడుదల కావాల్సిన సాగర్‌జలాలు ఫిబ్రవరి నెల ప్రారంభమైనప్పటికీ నేటికీ విడుదల కాలేదు. సాగర్‌జలాల విడుదలలో నాలుగునెలల జాప్యం నెలకొనడంతో ఆయకట్టు పరిధిలో రబీసాగు పంటలకు సాగర్‌జలాలు అందేపరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పాలకుల నిర్లక్ష్యం..రైతులకు శాపం..

నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్ఎస్‌పీ) మూడో జోన్ పరిధిలో కంచికచర్ల, వీరులపాడు మండలాలు ఉన్నాయి. జోన్–3కి గతేడాది నవంబర్ 15నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు సాగర్ జలాలను విడుదల చేయాల్సి ఉంది. రాష్ట్రప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి సాగర్ జలాశయం నుంచి సాగర్ జలాలను విడుదల చేయాల్సిన ఉన్నప్పటికీ ఆదిశగా కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతుల పాలిటశాపంగా మారింది. సాగర్ జలాలు విడుదలగాకపోవడంతో ఇబ్రహీంపట్నం, మూలపాడు మేజర్ కెనాల్ పరిధిలో ఉన్న రైతులు సాగుచేసిన పంటలకు సాగునీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. మూడో జోన్‌లోని ఆయకట్టుకు హక్కుగా రావాల్సిన సాగర్ జలాలను తీసుకువచ్చే విషయంలో నందిగామ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య బాధ్యత తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మూడో జోన్‌లోని విస్సన్నపేట, మైలవరం వరకు 200 క్యూసెక్కుల వరకు సాగునీరు రాగా వాటిని ముందు మైలవరం బ్రాంచి వరకు వదిలారు. అయితే కాలువకు అడుగడుగునా యూటీ(అండర్ టన్నెల్) రంధ్రాలు పడటంతో సాగర్ జలాలన్నీ రెడ్డిగూడెం మండలంలోని పలు చెరువులు, వాగుల్లోకి వెళ్లిపోయాయి. అంతేకాకుండా రెడ్డిగూడె వద్ద ఎస్కేప్ గేట్‌ను రాత్రి సమయంలో ఆప్రాంత రైతులు అక్రమంగా ఎత్తివేసి మూలపాడు, ఇబ్రహీంపట్నం మేజర్ కెనాల్స్‌కు సాగర్ జలాలు రాకుండా అడ్డుకున్నారు.



జమలాపురం వద్ద సాగర్‌కాల్వ యూటీకి పడిన గండిని పూడ్చుతున్న అధికారులు (ఫైల్)

నామమాత్రంగా పూడ్చిన యూటీలు...

విస్సన్నపేట, మైలవరం సమీపంలో సాగర్ కాల్వకు మూడు యూటీ(అండర్ టన్నెల్)లు పడ్డాయి. దీంతో సాగర్ నుంచి వచ్చే సాగునీరంతా చెరువుల్లోకి, వాగులు, కుంటల్లోకి వెళ్లిపోతోంది. సంబంధిత అధికారులు యూటీల మరమ్మతులు చేపట్టకుండా నామమాత్రంగా ఇసుక బస్తాలను అడ్డుపెట్టారు. అయినప్పటికీ సాగర్ జలాలు మూలపాడు, ఇబ్రహీంపట్నం మేజర్ కాల్వలకు సరఫరా కావడం లేదు. పూర్తిస్థాయిలో యూటీలను బాగుచేస్తే తప్ప ఈ ప్రాంతానికి సాగునీరు సరఫరా కాదని రైతులు చెబుతున్నారు.

సాగర్ నీటి కోసం ఎదురు చూస్తున్నాం..



రబీ సీజన్‌లో 14 ఎకరాల్లో మంచిశెనగ 14 ఎకరాలు సాగుచేశా. శెనగ పంట పిందె దశలో ఉంది. తేలికపాటి తడులు వేయాల్సి ఉంది. సాగర్ జలాలు కోసం ఎదురు చూస్తున్నాం. ఆ సాగునీరు రాకపోతే పంట దెబ్బతినే అవకాశం ఉంది. ఇబ్రహీంపట్నం , మూలపాడు మేజర్ కాల్వలకు సాగునీరు సరఫరా చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

–కందుల అశోక్‌కుమార్, పేరకలపాడు, కంచికచర్ల మండలం

పట్టించుకోని కూటమి ప్రభుత్వం...

ఆయకట్టు పరిధిలో రైతులు రబీ సీజన్‌లో పత్తి, మొక్కజొన్న, మంచి శెనగ, మినుము, తదితర పంటలను సాగుచేశారు. పిందెదశలో ఉన్న మంచిశెనగకు తేలికపాటి తడులు వేయాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతంలోని చెరువులన్నింటినీ సాగర్ జలాలతో నింపుకుంటేనే కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా ఉంటుంది. ఇలా రబీ సాగు పంటలకు అవసరమైన సాగునీటితోపాటు ఆయా చెరువులను నింపేందుకు సైతం సాగర్‌జలాలు కావాల్సి ఉంది. ఇకనైనా నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, సంబంధిత అధికారులు స్పందించి వీరులపాడు, కంచికచర్ల మండలాలకు సాగర్‌జలాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని శాంతినగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో పలుచోట్ల విద్యుత్ తీగలకు అడ్డువస్తున్న చెట్ల కొమ్మల నరికివేత కార్యక్రమం ఉన్నందున శనివారం పట్టణంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ ఎస్.కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని విజ్ఞాన్ నగర్, కనపర్తినగర్, శాంతినగర్, విష్ణుప్రియనగర్ తదితర ఏరియాల్లో ఈ సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

అందుబాటులో మందులు

పశువైద్యాధికారి అనిల్

పెనుగంచిప్రోలు:చర్మ వ్యాధులతో బాధపడుతున్న కుక్కలకు అవసరమైన మందులు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పశు వైద్యాధికారి పి.అనిల్ తెలిపారు.'కుక్కలకు..చర్మ వ్యాధులు..భయపడుతున్న ప్రజలు' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. చర్మవ్యాధులతో బాధపడుతున్న కుక్కలను గ్రామ పంచాయతీ వారి సహకారంతో పట్టుకుని తీసుకువస్తే వైద్య సేవలు అందిస్తామని వివరించారు.

అమలులోకి ఎన్నికల నియమావళి

పెనుగంచిప్రోలు: కృష్ణా–గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కోడ్ నిబంధనలు అమల్లోకి వచ్చాయని ఎంపీడీఓ జి.శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 8వతేదీ వరకు ఎన్నికల నియమావళి అమల్లో ఉంటుందన్నారు. కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో ఎటువంటి రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు ఉండకూడదన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో రాజకీయ నాయకులు ఫొటోలు ఉండకూడదని సూచించారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

జెడ్పీ సీఈవో కన్నమ్మనాయుడు

చిల్లకల్లు(జగ్గయ్యపేట):రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మతులకు గురైన బోరు పంపులను గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. సీపీడబ్ల్యూఎస్ ట్యాంకులను గుర్తించి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది బాధ్యాతరహితంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మల్కాపురం, తక్కెళ్లపాడు, వేదాద్రి గ్రామాల్లో పర్యటించి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వేదాద్రిలో పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని పరిశీలించి వినియోగంలోకి తీసుకురావాలని ఏఈ శ్రీనివాసరావును ఆదేశించారు. వేదాద్రి యోగానంద లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఇందుగపల్లి మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న సీఈవో కన్నమ్మనాయుడు, ఎంపీపీ, అధికారులు

వత్సవాయి మండలంలో...

ఇందుగపల్లి(వత్సవాయి): ఇందుగపల్లి రక్షిత మంచినీటి పథకాన్ని జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకాల చిన్నపాటి మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ కొలుసు రమాదేవి మాట్లాడుతూ గతేడాది సెప్టెంబర్‌లో వచ్చిన వర్షాలకు మునేటికి వరదలు వచ్చి పైపులైన్ మొత్తం కొట్టుకుపోయిందని, ఇంత వరకు మరమ్మత్తులు చేపట్టకపోవడంతో వత్సవాయికి మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందని సీఈఓకు వివరించారు. గ్రామంలో జగనన్న కాలనీకి పైపులైన్ వేసి మంచినీటి సదుపాయాన్ని అందించాలన్నారు. ఆళ్లూరుపాడు, మాచినేనిపాలెం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందంటూ సమస్యను సీఈవో దృష్టికి తీసుకురాగా, అధికారులు ఆయా పనులను వెంటనే చేపట్టి పూర్తిచేయాలని సీఈఓ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చావా నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్, డీఈ డీఆర్‌ఎల్ ప్రసాద్, ఏఈ స్వామినాయక్, వత్సవాయి, జగ్గయ్యపేట ఎంపీడీవోలు ఎస్.రాంబాబు, జి.నితిన్, ఈవోపీఆర్డీ మాధవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు

మక్కపేట/భీమవరం(వత్సవాయి):బాల్యవివాహాల కారణంగా ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటాయని ఏసీడీపీవో నాగమణి పేర్కొన్నారు. తల్లిదండ్రులు బాల్యవివాహాల నిర్మూలనకు సహకరించాలని కోరారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మండలంలోని మక్కపేట, భీమవరం గ్రామాల్లోని జెడ్పీ పాఠశాలల్లో బాల్యవివాహాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల కారణంగా చిన్నతనంలోనే బాలికలు అనారోగ్య సమస్యల బారినపడి బలహీనంగా మారుతున్నారని చెప్పారు. ముఖ్యంగా తల్లిదండ్రులు ఆడపిల్లలకు చిన్నతనంలోనే వివాహాలు చేస్తున్నారని, అటువంటి వివాహాలు చేయడం నేరమన్నారు. అంగన్‌వాడీలు తమ పరిధిలో బాల్య వివాహాలు జరిగితే సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి ఎం.రాజేశ్వరరావు, కౌన్సిలర్ జీవన్ కుమార్, ఏఎన్ఎం నిరోష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, బీబీజాన్, రాణి, హెచ్ఎం రామానాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీడీపీవో నాగమణి

విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్



ఆరంజ్ బెల్టు సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

జగ్గయ్యపేట: విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుతోపాటు క్రీడలు, కరాటే, కుంగ్‌ఫూ తదితర అంశాలపై ఆసక్తి పెంపొందించుకోవాలని తపోవన్ పాఠశాల ప్రిన్సిపాల్ మండవ సుధీర్ సూచించారు. పట్టణంలోని పాఠశాలలో జన్‌షిటో రే కరాటే–డు అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 100 మంది విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ టెస్ట్‌కు కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రతాప్‌కుమార్ ఎగ్జామినర్‌గా, ఆవుల రాజనార్, వంజేపల్లి మల్లిక, రెడ్డి మహేష్ అసిస్టెంట్ ఎగ్జామినర్‌లుగా వ్యవహరించారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వైట్ బెల్టు నుంచి ఆరంజ్ బెల్టుకు ప్రమోట్ చేసి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అనంతరం కరాటే కోచ్ ఎరుగొర్ల పూజను అభినందించారు.

హైవే వెంబడి ఫుడ్‌ట్రక్‌లు

పెనుగంచిప్రోలు: జాతీయ రహదారులపై దూర ప్రాంతాల నుంచి ప్రయాణాలు సాగించేవారిని దృష్టిలో పెట్టుకుని రహదారుల పక్కన వాహనాలు తిరగనిచోట ఖాళీస్థలాల్లో ఏర్పాటు చేస్తున్న ఫుడ్ ట్రక్‌లను ఆదరణ పెరుగుతోంది. ముఖ్యంగా పట్టణాలు, నగరాల నుంచి జాతీయ రహదారులపై ప్రయాణించేవారు రోజూ తింటున్న ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌లకు భిన్నంగా గ్రామీణ ఆహారాన్ని ఇష్టపడుతుండటంతో ఫుడ్ ట్రక్‌లకు ఆదరణ పెరుగుతోంది. నిర్వాహకులు ఎక్కడ వ్యాపారం సాగుతుంటే అక్కడ వారి ట్రక్‌ను ఉంచి వ్యాపారం నిర్వహిస్తున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలతోపాటు చదువుకున్న విద్యార్థులు సైతం ఫుడ్ ట్రక్‌లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు.

పదుల సంఖ్యలో ఫుడ్‌ట్రక్‌లు..

65వ నెంబర్ జాతీయ రహదారిపై జగ్గయ్యపేట మండలం నుంచి విజయవాడ వరకు పదుల సంఖ్యలో ఫుడ్ ట్రక్‌లు ఉన్నాయి. వీటిలో అత్యధిక శాతం ఫుడ్ ట్రక్‌లు టోల్‌ప్లాజా, ప్రయాణికులు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.



చిల్లకల్లు టోల్‌ప్లాజా సమీపంలో ఏర్పాటు చేసిన ఫుడ్‌ట్రక్

జోరుగా సాగుతున్న వ్యాపారం..

ప్రయాణ సమయంలో ఎక్కడికక్కడే ఫుడ్‌ట్రక్‌ల వద్ద ఆహారం లభిస్తుండటంతో ఈ మార్గంలో కార్లు, ఇతర వాహనాల్లో ప్రయాణించే వారు అక్కడ ఆగి టిఫిన్, భోజనాలు చేస్తున్నారు. ఆయా ప్రాంతాన్ని బట్టి ఒక్కో ఫుడ్‌ట్రక్ వద్ద రోజూ రూ.4వేల నుంచి సెంటర్‌ను బట్టి రూ.10వేల వరకు వ్యాపారం సాగుతోందని నిర్వాహకులు చెబుతున్నారు.

న్యాయవాదుల నిరసన



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాది బెజవాడ బిక్షమయ్యపై పోలీసుల అక్రమ చర్యలను ఖండిస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన నిరసన శుక్రవారంతో ఐదవ రోజుకు చేరింది. ఈసందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ పోలీసుల అక్రమ చర్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. బార్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు మాట్లాడుతూ తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని వివరించారు. బంటుమిల్లిలో న్యాయవాదిపై పోలీసుల దురుసు ప్రవర్తించడం తగదంటూ న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు యర్రమాజు ధనుంజయుడు, గోనెల వెంకటేశ్వర్లు, శ్రీనివాసగౌడ్, బూడిద నరసింహారావు, జంగా నరసరాజు, ఎం.ఆంజనేయులు, పూల నాగరాజు, కిషోర్, అశోక్, నరేష్, చిన్న గాంధీ, అంకమరాజు, రవి, రాజశేఖర్, గురువుల రాజు, శేషకుమారి పాల్గొన్నారు.

పొద్దుపోయే వరకు భూముల రిజిస్ట్రేషన్లు

కంచికచర్ల: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో భూములు, స్థలాల రిజిస్ట్రేషన్లు శుక్రవారం రాత్రి పొద్దుపోయేవరకు సాగాయి. ఫిబ్రవరి 1వ తేదీ శనివారం నుంచి భూములు, స్థలాల విలువలను పెంచుతామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించడంతో రిజిస్ట్రేషన్ చార్జీలు అధికమవుతాయనే ఉద్దేశంతో కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. సాధారణ రోజుల్లో 20 వరకు జరిగే రిజిస్ట్రేషన్లు శుక్రవారం 60కిపైగా జరిగినట్లు సబ్‌రిజిస్ట్రార్ వీఎస్‌టీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ.60లక్షలు ఆదాయం వచ్చినట్లు వివరించారు.

రిజిస్ట్రేషన్ సేవలు పునరుద్ధరించరూ..

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులో భూముల రిజిస్ట్రేషన్ల సేవలను పునరుద్ధరించాలని వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గతంలో వారంలో ఒకరోజు పెనుగంచిప్రోలులో రిజిస్ట్రేషన్ సేవలు అందించేవారని, ఆ సదుపాయాన్ని రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతాధికారులు తిరిగి ప్రారంభించాలన్నారు. వారంలో రెండురోజులపాటు భూముల రిజిస్ట్రేషన్ల సేవలు పెనుగంచిప్రోలులో కొనసాగిలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



కొనుగోలు, అమ్మకందారులతో కిటకిటలాడుతున్న కంచికచర్ల రిజిస్ట్రార్ ఆఫీసు

ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



నందిగామలో కలశ పూజ చేస్తున్న భక్తులు



కంచికచర్ల కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

నందిగామటౌన్: పట్టణంలోని శ్రీపురంలో వేంచేసియున్న వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, కలశ పూజలతోపాటు మంగళవాయిద్యాల నడుమ వాసవీ అమ్మవారి నగరోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో స్నపన, శ్రీచక్ర నవవర్ణార్చన, అష్టోత్తర సహస్రనామ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రికి భక్తులు అమ్మవారి నిప్పుల గుండంలో నడిచి తమ భక్తిని చాటుకున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మారం వెంకటేశ్వరరావు, కోశాధికారి ఊటుకూరి సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘ నాయకులు చవట నాగేశ్వరరావు, సీతారామ గుప్త, మారం అమరయ్య, అర్చకుడు మణికంఠ పాండే, ఆలయ కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల: స్థానిక పెద్దబజార్‌లోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు, భక్తులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి హోమం నిర్వహించారు. లక్ష్మీ సహస్రనామం, విష్ణు సహస్రనామం, జై వాసవి నినాదాలతో అమ్మవారి ఆలయం మార్మోగింది. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణా దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా గోపూజ చేశారు. అనంతరం సామూహిక కుంకుమపూజలు చేశారు. అమ్మవారిని పూలచీరతో అలంకరించారు. ఆలయం మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బొగ్గవరపు వెంకటరాజారావు తదితరులు పాల్గొన్నారు.



వత్సవాయిలో సామూహిక కుంకుమపూజలు చేస్తున్న మహిళలు

మధురంగా సాగిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: ఘంటసాల కళాసమితి, శ్రీలలిత కళాస్రవంతి, విజయవాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ స్టేడియంలోని వాకర్స్ క్లబ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. పీవీఎస్ఎస్ శర్మ, డాక్టర్ దామోదర గణపతిరావు, ఎన్.ప్రసాదరెడ్డి, కొమ్మినేని రత్నకుమారి, పద్మజ, వీ కామేశ్వరి, మల్లాది స్వాతి మధుర గీతాలను ఆలపించారు.